క్లుప్తంగా

ఎస్వీ సుబ్బారెడ్డిని పరామర్శించిన మంత్రి



మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డితో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

పత్తికొండ రూరల్ : పత్తికొండలో తన నివాసంలో మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డిని మంగళవారం మాజీ డిప్యూటీ సీఎం, కేఈ కృష్ణమూర్తి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అల్లుడు కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్‌చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డితో కాసేపు మాట్లాడారు. ఈయన వెంట టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, మాజీ జెడ్పీచైర్మన్ బత్తిన వెంకట్రాముడు తదితరులు ఉన్నారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు



ఆస్పరి: ఆస్పరిలోని మారెమ్మవ్వ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు గోవిందు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మారెమ్మ .. కరుణించమ్మా



కృష్ణగిరి: మండలంలోని అమ్మవార్ల దేవాలయాల్లో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్లూరు గ్రామంలోని మారెమ్మ అమ్మవారికి, ఎస్‌హెచ్ ఎర్రగుడి, కంబాలపాడు గ్రామాల్లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సిద్ధేశ్వరుడికి వెండి నాగాభరణం విరాళం



వెల్దుర్తి: పట్టణంలోని పాతబడి(ఎంపీపీ మెయిన్ స్కూల్) పక్కన కొలువైన సిద్ధేశ్వర స్వామికి వెండి నాగ పడగను పట్టణానికి చెందిన మానవ పాటి సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులు విరాళంగా అందించారు. రూ.2.50లక్షలకు పైగా విలువ గల 2కేజీల వెండితో తయారు చేసిన ఈ ఆభరణాన్ని దాతల సమక్షంలో ప్రత్యేక పూజల నడుమ ఈనెల 23న స్వామివారికి అలంకరించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకుల మృతికి సంతాపం



కిష్టప్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు రూరల్: చిప్పగిరి మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కిష్టప్ప, బంటనహాల్ గ్రామానికి చెందిన నాయకులు లింగన్నల మృతి బాధాకరమని ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. మంగళవారం ఆయన చిప్పగిరిలో కిష్టప్ప మృతదేహానికి, బంటనహాల్ గ్రామంలో లింగన్న మృతదేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. వీరి కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నేడు మఠ్రితాత మఠంలో ప్రత్యేక పూజలు

ఆలూరు: స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలో ఉన్న మఠ్రితాత మఠం ఆవరణలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. శాంతి హోమం, జమ్మిచెట్టు కట్ట, పాదాల ప్రతిష్ఠాపన తదితర పూజలను చేపట్టనున్నట్లు వెల్లడించారు.

సీజనల్ హాస్టల్ తనిఖీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ ఈరన్న

హొళగుంద: స్థానిక కొండ కాలనీలోని కర్లమాగి పాఠశాల భవనంలో నిర్వహిస్తున్న సీజనల్ హాస్టల్‌ను ఎంఈఓ-2 జగన్నాథం మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు వసతి, నాణ్యమైన భోజనం, విద్యా అందుతుందా లేదా అని ఆరా తీశారు. కొద్ది సేపు విద్యార్థులతో ముచ్చటించారు. నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉషోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకుడు చిన్నహ్యాట నాగరాజు, సీఆర్పీలు లక్ష్మప్ప, తుకారాం, రేణుక ఉన్నారు.

ఆరోగ్యమిత్రలకు కూటమి పోటు!

- ఆరోగ్యశ్రీని బీమా కంపెనీలకు అప్పగించే యోచనలో ప్రభుత్వం
- ఉద్యోగ భద్రత ఉండదని ఆందోళన చెందుతున్న వైద్య మిత్రలు
- జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 116 మంది విధులు



ఆలూరు సీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న వైద్యమిత్ర

ఆలూరు రూరల్: ఆరోగ్యశ్రీ పథకం (ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్) రోగులకు వైద్య సేవలు అందించడంలో కీలక భూమిక పోషిస్తున్న వైద్యమిత్రలకు భరోసా కరువైంది. కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని బీమా కంపెనీకి అప్పగిస్తారన్న ప్రకటన వైద్యమిత్రలను ఆవేదనకు గురిచేస్తోంది. 17 ఏళ్లుగా ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్న వారికి నేడు ఆధారం కోల్పోతామేమోనన్న భయం వెంటాడుతోంది.

జిల్లాలో 116 మంది

జిల్లాలోని 5 సీహెచ్‌సీలు, ఏరియా, 2 ఎంసీహెచ్, 2 ఏరియా, జీజీహెచ్ నెట్వర్క్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ సేవలు కొనసాగుతున్నాయి. వాటిలో 68కు పైగా ప్రైవేటు, 12 ప్రభుత్వాసుపత్రులున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం నిర్వహణకు 15 ఆసుపత్రులకు ఒక టీం లీడర్, ఆఫీస్ అసోసియేట్ ఇద్దరు, జిల్లా మేనేజరుగా ఒకరు మొత్తం 116 మంది పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.15 వేల జీతాన్ని ఇస్తున్నారు. ఇందులో పీఎఫ్, ఈఎస్ఐ కింద రూ.2 వేలు కటింగ్ పోగా రూ.13 వేలు చేతికందుతోంది. వైద్య మిత్రలంతా ఉన్నత చదువులు చదివిన వారే. ఎప్పటికైనా తమకు గుర్తింపు, కనీస వేతనం అందుతుందని, ఉద్యోగ భద్రత ఉంటుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. సీఎఫ్ఎంఎస్‌లో జీతాలివ్వడం ప్రారంభించినప్పటి నుంచి వారి కుటుంబాలు ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా పరిగణిస్తున్నారు.

రోగులకు సేవలందించడంలో ప్రధాన భూమిక

నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో నెలకు వెయ్యికి పైగా శస్త్రచికిత్సలు జరుగుతున్నట్లు అంచనా. రోగులకు హాస్పిటళ్లలో చేరినప్పటి నుంచి తిరిగి క్షేమంగా ఇంటికి వెళ్లే వరకు నిరంతరం వైద్యమిత్రలు పర్యవేక్షిస్తుంటారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుండటంతో వైద్యమిత్రలంతా ఆందోళన చెందుతున్నారు. తమకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉంచుతారా.. లేక ప్రైవేటుకు అప్పగిస్తారా..? అనే అనుమానం వెంటాడుతోంది. ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ఎన్నోఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న సర్వీస్ మొత్తం ఎందుకు పనికి రాకుండా పోతుందని ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు వారు ఉద్యోగాలు కొనసాగిస్తారా లేక కొత్తవారిని తీసుకుంటారా అనే భయాందోళనలో ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ పథకంలో 17 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వైద్య మిత్రలు, టీం లీడర్లు, ఆఫీస్ అసోసియేట్, జిల్లా మేనేజర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి. న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరుగుతున్నాం. ఎన్నికల హామీలో భాగంగా సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలి. వైద్యమిత్రలను ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తే మాకు ఇబ్బందులు వస్తాయి.

– కంబగిరి, వైద్యమిత్ర యూనియన్ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం చొరవ చూపాలి

వైద్యమిత్రలపై ప్రభుత్వం చొరవ చూపాలి. వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత కల్పించాలి. ఎన్టీఆర్ వైద్యసేవను బీమా కంపెనీలకు అప్పగిస్తే మా ఉద్యోగాలకు భరోసా ఉండదు. కూటమి ప్రభుత్వం నుంచి స్పష్టమైన భరోసా కోసం ఎదురు చూస్తున్నాం.

– కృష్ణా రెడ్డి, వైద్యమిత్ర, ఆలూరు

మంచినీటి పైపులైన్ ఏర్పాటు

హాలహర్వి: మండలకేంద్రమైన హాలహర్విలోని కొత్తగేరి ఏరియాలో మంగళవారం మంచినీటి పైపులైన్ ఏర్పాటు పనులు చేపట్టినట్లు సర్పంచ్ మల్లికార్జున తెలిపారు. చాలా సంవత్సరాల నుంచి ఆ ఏరియాలో ఉన్న కుటుంబాలకు మంచినీరు లేదన్నారు. పైపులైన్ ఏర్పాటు చేసి కొత్తగా ఏర్పడిన సచివాలయంలో కూడా నీటి సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కృష్ణగిరి: ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య(యూనిక్ ఐడీ) కోసం ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 5 వేల మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందన్నారు.

ఎల్లెల్సీ గట్టుపై కోళ్ల వ్యర్థాలను తొలగించండి

హొళగుంద: స్థానిక తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) గట్టు, పరిసరాలలో కోళ్ల ఈకలు, వ్యర్థాలను వేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతోందని, వెంటనే వాటిని తొలగించాలని గ్రామస్తులు క్రిష్టయ్య, బసవ, వెంకటేష్, రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా తదితరులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి



ఆస్పరి పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఆస్పరి: పోలీసులు అప్రమత్తంగా ఉండి నేరాలను నివారించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. మంగళవారం ఆస్పరి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సిబ్బంది పని తీరు గురించి సీఐ మస్తాన్‌వలి, ఎస్ఐ నరసింహులును అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, ఒపెన్ డ్రింకింగ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించే బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాలలో రాత్రి వేళల్లో గస్తీ పెంచాలన్నారు.

యాంటీ ఈవ్‌టీజింగ్ బీట్ తనిఖీ

దేవనకొండ: మండలకేంద్రమైన దేవనకొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాంటీ ఈవ్ టీజింగ్ బీట్‌ను మంగళవారం సాయంత్రం జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తనిఖీ చేశారు. ఈవ్‌టీజింగ్, ఆకతాయి పనులకు పాల్పడే వారిపై జిల్లా పోలీసుశాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈవ్‌టీజింగ్, ఆకతాయిల వల్ల విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే పోలీసుల దృష్టికి తీసుకొచ్చేవిధంగా విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈవ్‌టీజింగ్‌ను అరికట్టాలనే ఉద్దేశంతో జిల్లావ్యాప్తంగా ఈవ్ టీజింగ్ బీట్స్‌ను కొత్తగా అమలులోకి తీసుకొచ్చామన్నారు.

నేడు హొళగుందలో ఎమ్మెల్యే పర్యటన

హొళగుంద: ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి బుధవారం హొళగుందలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరవుతున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్, వైస్ ఎంపీపీలు, ఎంటీపీసీలు, సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు వైఎస్సాఫ్‌లీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఉల్లి సాగుపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న ఉద్యాన అధికారి దస్తగిరి

పత్తికొండ రూరల్ : మండల పరిధిలోని హోసూరు గ్రామంలో ఉల్లి పంట సాగుపై మంగళవారం ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు వెంకట్రాముడు, దస్తగిరి మాట్లాడుతూ ఉల్లి పంటలో మేలు రకమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఎత్తు నారుమడులలో పంట సాగు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఉల్లి సాగులో వచ్చే కుళ్లు తెగులు గురించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ప్రతి రైతు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రైతు గుర్తింపు సంఖ్య ఆధారంగానే సంక్షేమ పథకాలు వర్తిస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏఈఓలు రియాజ్, శ్రీనాథ్, హార్టికల్చర్ ఏఈఓ నాగ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ దిలీప్ కుమార్

ఆలూరు రూరల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ దిలీప్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. డబ్బు ఆశతో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టపోరాదని, అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు ఓటీపీలు చెప్పరాదని సూచించారు. బ్యాంకు ఖాతా, ఆధార్, పాన్ నంబర్లను అపరిచిత వ్యక్తులకు పంపవద్దని చెప్పారు. డిజిటల్ అరెస్టు అనేది చట్టంలో లేదని ఇది ఒక రకమైన మోసమని తెలిపారు. ఈవ్‌టీజింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు.



బండలాగుతున్న ఎద్దులు

ముగిసిన మస్తాన్‌వలి ఉరుసు

దేవనకొండ: మండలంలోని కొత్తపేట గ్రామంలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న మస్తాన్ దివాన్‌వలి ఉరుసు మంగళవారంతో ముగిసింది. వేడుకల్లో కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అంతర్‌రాష్ట్ర బండలాగుడు పోటీలను సర్పంచ్ షేకమ్మ, బాబు, నిర్వాహకులు తిక్కయ్య, మస్తాన్ ప్రారంభించారు. ఈరాతిదూలం లాగుడు పోటీల్లో విజేతగా శనగపల్లి వృషభాలు నిలిచి రూ.50 వేలు బహుమతిని అందుకున్నాయి. ఆతువాతి స్థానాల్లో రేమట ఎద్దులు రూ.40 వేలు, లక్ష్మీపల్లి వృషభాలు రూ.25 వేలు, కొత్తబురుజు ఎద్దు రూ.15 వేలు, మల్యాల వృషభాలు రూ.10 వేలు బహుమతిని అందుకున్నాయి. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకప్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ముత్తుకూరులో దేవర

ఆస్పరి: మండలంలోని ముత్తుకూరు గ్రామంలో బుధవారం బంగారమ్మవ్వ, పెద్దమ్మవ్వ దేవర నిర్వహించనున్నట్లు సర్పంచ్ తోయజాక్షప్ప మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా అమ్మవార్లకు గ్రామంలో కుంభాలను మేళతాళాలతో ఊరేగించి నైవేద్యం సమర్పిస్తామన్నారు. దేవర కార్యక్రమంలో ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి పాల్గొంటారని చెప్పారు.

ఎల్. నగరంలో నేడు దేవర

వెల్దుర్తి: ఎల్. నగరం గ్రామంలో బుధవారం మారెమ్మ, పెద్దమ్మ, కల్లెమ్మ, సుంకులమ్మ, బజారు సుంకులమ్మ అమ్మవార్ల దేవర నిర్వహించనున్నారు. అర్ధరాత్రి నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయి. దేవర పురస్కరించుకుని గ్రామంలో సందడి నెలకొంది. ఇంటికి వచ్చిన ఆడపడుచులు, బంధుగణంతో కిక్కిరిసింది. 31 ఏళ్ల తర్వాత దేవర నిర్వహిస్తుండటంతో గ్రామస్తులంతా ఏకమై ఘనంగా ఏర్పాట్లు చేశారు.

21న నేలతలమరిలో ఉరుసు

దేవనకొండ: ఈనెల 21వ తేదీ నుంచి మండలంలోని నేలతలమరి గ్రామంలో దస్తగిరయ్య స్వామి ఉరుసు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు మంగళవారం తెలిపారు. 21న గంధం, 22న ఉరుసు, 23న జియారత్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులకు తాగునీరు, వసతి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.

డంపింగ్‌యార్డుకు స్థల పరిశీలన

మద్దికెర : మద్దికెర గ్రామ పంచాయతీకి సంబంధించి డంపింగ్ యార్డు కోసం గ్రామ శివార్లలో వున్న యజ్ఞం చెరువు సమీపంలో వున్న స్థలాన్ని మంగళవారం తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వున్న డంపింగ్ యార్డు నుంచి విద్యార్థులు, కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. పంచాయతీ అధికారుల విజ్ఞప్తి మేరకు చెరువు వద్ద వున్న స్థలాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ఆర్ఐ రవికుమార్, ఈఓ శివకుమార్, బండారి ఆంజనేయులు, మాధవ్ ఉన్నారు.

పి.కోటకొండలో 'పొలం పిలుస్తోంది'

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి(ఏఓ) సురేష్‌బాబు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వేరుశనగ పంటలను పరిశీలించారు. 40 నుంచి 45 రోజులు మధ్యలో జిప్సం ఎకరాకు నాలుగు బస్తాలు 50 కేజీల చొప్పున వేయాలని సూచించారు. దీంతో ఊడలు బాగా అభివృద్ధి చెందుతాయని, నేల కూడా మెత్తబడి ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ దస్తగిరి, ఏఈఓ రంగన్న, సునీల్, వీహెచ్ఏ లింగేశ్వర పాల్గొన్నారు.

స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

ఆలూరు రూరల్: మండలంలో అభ్యంతరం లేని భూములలో నివాసం ఉండే ఆక్రమణదారులు తమ స్థలాల క్రమబద్ధీకరణ కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ గోవింద్ తెలిపారు. దరఖాస్తు చేసుకుంటే నియమనిబంధనల మేరకు క్రమబద్ధీకరణ అనుమతులు పొందుతారని పేర్కొన్నారు.

20న వెరిఫికేషన్

హాలహర్వి: మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 20, 21వ తేదీల్లో జాయింట్ వెరిఫికేషన్ ఉంటుందని ఎంపీడీఓ వరలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈనెల 20వ తేదీన ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కింద హాలహర్వి, గూళ్యం, చింతకుంటకు దరఖాస్తు చేసిన వారికి వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. అలాగే ఈనెల 21వ తేదీన ఇండియన్ బ్యాంకు కింద హాలహర్వి, మెదేహాల్, ఆలూరు ఎస్‌బీఐలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తులపై వెరిఫికేషన్ ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ హాజరుకావాలని సూచించారు.

వైభవంగా తిమ్మప్పస్వామి రథోత్సవం



జన వాహిని మధ్య రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మద్దికెర : మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో మంగళవారం అశేష జన వాహిని మధ్య తిమ్మప్ప, దడేధూళప్ప, యడివళ్ళప్పస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, సహస్ర అష్టోత్తర నామం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య, మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి రథంలో కొలువుంచారు. అనంతరం రథం ముందు హోమం నిర్వహించి స్వామి వార్ల రథోత్సవం ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల వారు పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణపై శిక్షణ

ఆలూరు రూరల్: అంగన్‌వాడీల్లో చదువుతున్న చిన్నారుల సంరక్షణ, ప్రాథమిక విద్యపై ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం మొదటి రోజు మంగళవారం స్థానిక జెడ్పీ బాలికల పాఠశాలలో ప్రారంభమైంది. ఐసీడీఎస్ సీడీపీఓ శశికళ, ఎంఈఓలు కోమలాదేవి, చిరంజీవి రెడ్డి అంగన్‌వాడీ కార్యకర్తలకు బోధనపై శిక్షణ అందించారు. పిల్లలకు అందించే బోధనాంశాలు, వారి సంరక్షణ పై శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలంలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు 6 రోజుల శిక్షణ తరగతులను ఎంఈఓ-2 జగన్నాథం, హెబ్బటం హైస్కూల్ హెచ్‌ఎం రంగన్న తదితరులు ప్రారంభించారు. కేంద్రాలలో విద్యార్థుల విద్యాభివృద్ధిని పెంపొందించడం తదితర అంశాల పై డీఆర్పీలు షీబారాణి తదితరులు శిక్షణ ఇచ్చారు.

పత్తికొండ(తుగ్గలి) : జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ కోర్సులో భాగంగా పత్తికొండ, తుగ్గలి మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం కోర్సు డైరెక్టర్లు రమేష్, రామవెంకటేశ్వర్లు, సీడీపీవో లలిత ప్రారంభించారు.

వెల్దుర్తి: అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందికి జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ఎంఈఓ ఇందిర ఆధ్వర్యంలో స్థానిక బాలుర హైస్కూల్‌లో ప్రారంభమైంది. డీఆర్పీలు ప్రవీణ్, నాగేశ్వరరావు, శారద, సరస్వతి తదితరులు 59మందికి శిక్షణ అందించారు.

భూములు ఆన్‌లైన్ చేయండి

ఆలూరు: వారసత్వం, కొనుగోలు చేసిన భూములకు అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, వాటికి ఆన్‌లైన్ 1బీ అడంగల్ చేయాలని కురుకుంద గ్రామానికి రైతులు వెంకటేశ్వరెడ్డి, మల్లికార్జునగౌడు, బోయ గోవిందప్ప ఆలూరు తహసీల్దార్ గోవిందు సింగ్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. రైతులు మాట్లాడుతూ.. నాలుగేళ్ల క్రితం గ్రామంలో ఇతర రైతుల వద్ద కొన్న భూములకు ఆన్‌లైన్ చేసుకోకపోవడం వల్ల తమకు బ్యాంకులలో పంటరుణాలను అధికారులు మంజూరు చేయడం లేదన్నారు. వారి వెంట సీపీఐ జిల్లా నాయకుడు భూపేష్ ఉన్నారు.

హామీలు నెరవేర్చాలి

వెల్దుర్తి: కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన అసోసియేషన్ మండల సమితి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పథకాలన్నీ అంగన్‌వాడీలకు అందేలా చర్యలు తీసుకోవాలని, పింఛన్లు పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో జిల్లా, మండల సమితి ప్రతినిధులు ఈదమ్మ, సంధ్యారాణి, సురేఖ, మహబూబ్‌బి తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ పిచ్‌ను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్

పత్తికొండ రూరల్ : యువత క్రీడల్లో రాణించాలని రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. పత్తికొండలో బ్రహ్మంగారి తిరునాల సందర్భంగా నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ సౌత్ ఇండియా లెవెల్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ శారీరక దేహ ధారుడ్యానికి చక్కని వ్యాయామం, క్రీడలను ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, మాజీ మంత్రి కేఈ కృష్ణమూర్తి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

మైక్రో ఫైనాన్స్ వేధింపులు ఆపాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పత్తికొండ రూరల్ : గ్రామాల్లోని రైతులు, చిరువ్యాపారులపై మైక్రో ఫైనాన్స్ వేధింపులను ఆపాలని కోరుతూ సీపీఎం నాయకులు కోరారు. వివిధ ఫైనాన్స్ కంపెనీల బాధితులు రామాంజినేయులు, ముక్కెళ్ల గోవర్ధన్‌రాజు, దూదేకొండ పులికొండ తదితరులతో కలిసి పత్తికొండలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ దళారులతో గ్రామాల్లో గృహ రుణసదుపాయాల పేరుతో ప్రచారం చేయించి, రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని వారికి అప్పులు ఇచ్చారన్నారు. పూర్తిగా కరువు కాటకాలతో అల్లాడిపోతున్న రైతులు అప్పులు తీర్చలేని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంతు కట్టడం ఆలస్యమైతే మైక్రోఫైనాన్స్ ఉద్యోగులు వేధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగారెడి, వెంకటేశ్వర్లు, దస్తగిరి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి కన్నడిగుల పాదయాత్ర



సేదతీరుతున్న భక్తులు

హొళగుంద: శ్రీశైల మల్లికార్జునస్వామి దర్శనం మంగళవారం కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాదయాత్రగా హొళగుంద మీదుగా తరలి వెళ్లారు. వారికి బళ్లారి రోడ్డులో హొళగుందకు చెందిన శ్రీశైల మల్లికార్జున స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహారం, భోజనం అందించారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా కురుగోడు, గెనికాళ్, దాసాపుర, మాసాపుర, శిరిగేరి తదితర గ్రాఆమలకు చెందిన దాదాపు 350 మందికి పైగా భక్తులు మల్లేశ్వరుని నామస్మరణ చేసుకుంటూ తరలి వెళ్లారు.